సాక్షి
కుమురం భీం
గురువారం : 20 : జూలై : 2023



రైతుబీమాతో ధీమా! 9లో▸

ఆపత్కాలంలో రైతుబీమా పథకం అండగా నిలుస్తోంది. కొత్తగా పట్టాలు పొందిన రైతులతోపాటు పాతవారు వివరాలు మార్చుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.



మొదలైన వరిసాగు పనులు

మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు వరి సాగు ప్రారంభించారు. మొలక అలకడం వంటి పనులతో బిజీగా మారారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.6/24.1

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): మన ఊరు– మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ సహాయ సంచాలకులు పి.రాజీవ్ అన్నారు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంజీవ్‌నగర్, పెంచికల్‌పేట్ ప్రాథమిక పాఠశాలను బుధవారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో చేపడుతున్న 'మన ఊరు– మన బడి' పనులు పరిశీలించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు అనంతరం తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధనా తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. తొలిమెట్టు రికార్డులు తనిఖీ చేసి ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ఆయన వెంట సెక్టోరియల్ ఆఫీసర్ స్వర్ణ, కాంప్లెక్స్ హెచ్ఎం యాదగిరి ఉన్నారు.

మహాసభ జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న రేగుంట కేశవ్‌రావు

ఆసిఫాబాద్: ఎస్సీ వర్గీకరణ కోసం ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభ జయప్రదం చేయాలని ఎంఎస్ఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, చంద్రపూర్ జిల్లా ఇన్‌చార్జి రేగుంట కేశవరావు మాదిగ అన్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో గల ఎస్సీ కమిటీ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగ ఉప కులాల విశ్వరూప మహాసభకు కర్నాటక, తమిళనాడు, చత్తీస్‌గఢ్, ఒడిస్సా, పాండిచ్చేరి, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌తోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన నాయకులు హాజరవుతారని తెలిపారు. మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు సమ్మయ్య, శంకర్, ప్రశాంత్, అనిత, ప్రభు, రాజేశ్, మహేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎస్పీఎం మహిళా కార్మికుల నిరసన



గేటు వద్ద బైఠాయించిన కార్మికులు

కాగజ్‌నగర్‌టౌన్: కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్పీఎం ప్లాంటేషన్ కేంద్రంలో పనిచేస్తున్న మహిళా కార్మికులు బుధవారం విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఎస్పీఎం ప్లాంటేషన్‌లో విధులు పనిచేస్తున్నామని, యాజమాన్యం కనీస వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గుత్తేదారు రోజుకు రూ.325 మాత్రమే చెల్లిస్తుండగా, మిల్లులో కాంట్రాక్టు కార్మికులకు రోజుకు రూ.437 చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళా కార్మికులకు తక్కువ వేతనం చెల్లించడం సరికాదన్నారు. కనీస వేతనాలతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే మహిళలు విధులు నిర్వహించాలనే నిబంధనలు ఉన్నాయన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన పీహెచ్‌సీని బుధవారం జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల కమిటీ కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ జయప్రకాశ్, డాక్టర్ ఆదర్శ్ ప్రియ అజాద్ సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను స్వయంగా పరిశీలించారు. పీహెచ్‌సీ సేవలు బాగున్నాయని కితాబిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, పీహెచ్‌సీ వైద్యాధికారి సుజిత్, క్వాలిటీ మేనేజర్ సాయి ప్రసాద్ ఉన్నారు.



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో ఓపీ వద్ద క్యూలో నిలబడిన చిన్నారులు

వైద్యం.. దైన్యం

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో భర్తీ కాని పోస్టులు
- మెరుగుపడని వైద్యసేవలు
- జిల్లా ఆస్పత్రితోపాటు పీహెచ్‌సీల్లోనూ రోగులకు ఇబ్బందులు
- వర్షాకాలంలో పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- ఏజెన్సీలో సీజనల్ జ్వరాలు ప్రబలే ప్రమాదం

మెడికల్ కాలేజీపై ఆశలు

ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో రూ.11.22 కోట్ల నాబార్డు నిధులతో జిల్లా కేంద్రంలో 50 పడకల ఆస్పత్రి నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ వైద్యం అంతంతే అందుతుండటంతో జిల్లావాసులు మెడికల్ కాలేజీపైనే ఆశలు పెట్టుకున్నారు. వైద్య కళాశాలకు అనుబంధంగా 50 పడకల ఆస్పత్రిని 330 పడకల స్థాయికి పెంచుతున్నారు. రెండో అంతస్తులో అదనపు గదుల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ ఏడాది నుంచే ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో వంద సీట్లతో కళాశాల ప్రారంభానికి జాతీయ వైద్యమండలి అనుమతులిచ్చింది. 22 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. ప్రిన్సిపాల్ నాగార్జునచారితో పాటు ఐదుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధుల్లో చేరారు. వైద్యకళాశాల ప్రారంభమైతే సేవలు మెరుగుపడతాయని జిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆసిఫాబాద్: జిల్లాలో మూడు రోజులుగా వర్షాలు జోరందుకున్నాయి. మరోవైపు పంచాయతీ కార్మికులు 13 రోజులుగా సమ్మెలో కొనసాగుతున్నారు. పరిస్థితుల్లో వ్యాధులు, విషజ్వరాలు వేగంగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. ఇలాంటి సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన వైద్యశాఖలో ఖాళీల బెడద వేధిస్తోంది. ప్రజలకు పెద్దదిక్కు వంటి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు వైద్యసేవలు అంతంతే అందుతున్నాయి. 50 పడకల ఆస్పత్రి నుంచి 330 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అవుతున్నా.. రోగుల సంఖ్య పెరుగుతున్నా సేవలు మాత్రం మెరుగుపడటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రోగులు ప్రైవేట ఆస్పత్రుల బాట పడుతున్నారు.

పీహెచ్‌సీల్లోనూ అదే పరిస్థితి

ఏజెన్సీలు, గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యం కోసం స్థానికంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపైనే ఆధారపడుతున్నారు. పాముకాట్లు, ప్రసవాలు, ప్రమాదాల సమయాల్లో పీహెచ్‌సీల సేవలే ఎంతో కీలకం. అయితే పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆసిఫాబాద్, సిర్పూర్ (టి)లో సీహెచ్‌సీలు ఉండగా, 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, 108 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. పీహెచ్‌సీల్లో 46 మంది వైద్యులకు 22 మంది విధులు నిర్వర్తిస్తుండగా 24 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 77 స్టాఫ్ నర్స్ పోస్టులకు 48 మంది పనిచేస్తుండగా 29 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని పీహెచ్‌సీల్లో అసలు వైద్యులే లేకపోవడంతో ఏఎన్ఎంలే రోగులకు వైద్యం అందించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల రాత్రివేళలో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. ఇందుకు తగినట్లుగా నైట్ షిఫ్టుల్లో పనిచేసే సిబ్బంది సంఖ్య పెంచాల్సి ఉంది.

'సీజనల్' భయం

వర్షాలు కురుస్తుండటంతో దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. మలేరియా, టైఫాయిడ్‌తోపాటు డెంగీ కేసులు నమోదవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో బుధవారం ఇద్దరికి మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ కాగా, ఆసిఫాబాద్ పట్టణంలోని సందీప్‌నగర్‌కు చెందిన ఓ మహిళకు డెంగీ నిర్ధారణ అయింది.

తీరు మారని జిల్లా ఆస్పత్రి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి తీరు మారడం లేదు. దశాబ్దాలుగా పూర్తిస్థాయి వైద్యులు లేక ప్రథమ చికిత్సకే పరిమితమవుతోంది. రెగ్యులర్ సూపరింటెండెంట్ లేకపోవడంతో ఇన్‌చార్జీలే కొనసాగుతున్నారు. సూపరింటెండెంట్‌తోపాటు 68 మంది వైద్యులుండాల్సి ఈ ఆస్పత్రిలో ప్రస్తుతం 13 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 13 మంది సివిల్ సర్జన్లు, 14 మంది డిప్యూటీ సివిల్ సర్జన్ల పోస్టులకు ఒక్కటీ భర్తీ చేయలేదు. 41 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు 13 మంది పనిచేస్తుండగా, 38 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిర్పూర్(టి) ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న గైనకాలజిస్టు డాక్టర్ చెన్నకేశవ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఇద్దరు ఈఎన్‌టీ వైద్యులు, ఒక ఆప్తాలమిస్టు, ఇద్దరు పిల్లల వైద్యులు, మత్తు వైద్యుడితోపాటు ఏడుగురు ఎంబీబీఎస్ వైద్యులు పనిచేస్తున్నారు. ఆస్పత్రిలో ప్రతిరోజూ సుమారు 250 మంది ఔట్‌పేషెంట్లు నమోదవుతుండగా, పదుల సంఖ్యలో ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. ప్రతినెలా సుమారు 40 కాన్పులు జరుగుతున్నాయి. రెగ్యులర్ గైనకాలజిస్టు లేక గర్భిణులు సర్జరీల కోసం మంచిర్యాల, కరీంనగర్‌కు వెళ్తున్నారు. జిల్లా ఏర్పడి ఐదేళ్లవుతున్నా వైద్యుల పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. ఆపరేషన్ థియేటర్ అలంకారప్రాయంగా మారింది. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఆస్పత్రిలో వైద్యం అందక పేదలు ప్రైవేట్‌కి వెళ్లి ఆర్థికంగా చితికిపోతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

పీహెచ్‌సీల్లో ఖాళీలపై రెండు నెలల క్రితం ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖాళీల భర్తీ ప్రక్రియ చేపడతాం. పీహెచ్‌సీలను నిరంతరం తనిఖీ చేస్తున్నాం. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల సమయ పాలనపై తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

– రామకృష్ణ, డీఎంహెచ్‌వో

జిల్లాలో 36.5 మి.మీ.ల వర్షపాతం నమోదు

ఆసిఫాబాద్: జిల్లాలో బుధవారం 36.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జైనూర్‌లో అత్యధికంగా 74.2 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా, సిర్పూర్(యూ)లో 70.6, లింగాపూర్ 54.8, తిర్యాణి 35, రెబ్బెన 28.8, ఆసిఫాబాద్ 33, కెరమెరి 35.4, వాంకిడి 38.2, కాగజ్‌నగర్ 32.4, సిర్పూర్(టి) 38.6, కౌటాల 22.2, చింతలమానెపల్లి 24.8, బెజ్జూర్ 15.2, పెంచికల్‌పేట్ 19.2, దహెగాంలో 25.4 మి.మీ.ల వర్షం కురిసింది.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఐఈవో శ్రీధర్‌సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు పది, ఇంటర్, డిగ్రీ, పీజీ ధ్రువపత్రాల జిరాక్స్‌లను డీఐఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు. జైనూర్ జూనియర్ కాలేజీలో 5, కాగజ్‌నగర్‌లో 16, సిర్పూర్(టి) 4, కౌటాల 4, బెజ్జూర్ 6, తిర్యాణి 3, దహెగాం 5, ఆసిఫాబాద్ 6, కెరమెరి 4, వాంకిడి 4, రెబ్బెన 4 పోస్టులు ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, ప్రిన్సిపాళ్లు సభ్యులుగా ఉండే కమిటీ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తుందని తెలిపారు. కాగజ్‌నగర్, రెబ్బెన జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ కోర్సులు బోధించేందుకు అవసరమైన అర్హతలు, ఇతర వివరాలకు డీఐఈవో కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.కనకయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిస్టరీ, రాజనీతిశాస్త్రం, ఇంగ్లిష్, తెలుగు, కంప్యూటర్, కామర్స్, గణితం, ఎకనామిక్స్, జంతుశాస్త్రం బోధించేందుకు ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99125 96756 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సాంకేతికత వినియోగం పెరగాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్
- నేర సమీక్షా సమావేశం



ఎస్సై వెంకటేశ్‌కు రివార్డు అందిస్తున్న ఎస్పీ

ఆసిఫాబాద్: నేరాల నియంత్రణ, నేరస్తులకు శిక్ష పడేందుకు పోలీసుశాఖలో సాంకేతికత వినియోగం పెరగాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో బుధవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జనవరి నుంచి జూన్ వరకు ఆరు నెలల్లో జరిగిన నేరాలపై పోలీస్‌స్టేషన్ల వారీగా సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు వృత్తి నైపుణ్యత పెంచుకుని శాస్త్రీయ పరిశోధనలో నిష్ణాతులు కావాలన్నారు. ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించి సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రోయాక్టివ్, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాలు పాటించాలని సూచించారు. సిబ్బందికి ఎస్‌హెచ్‌వోలు సరైన సూచనలిస్తూ, వారికి విధులపై అవగాహన కల్పించాలన్నారు.

బ్లాక్‌స్పాట్స్ గుర్తించాలి

రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను(బ్లాక్ స్పాట్) గుర్తించి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రంకెన్ డ్రైవ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళలు, పిల్లల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, గుట్కా, పేకాట, గుడుంబా, మట్కా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. అనంతరం సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన, సభ విజయవంతానికి కృషి చేసిన పోలీసు అధికారులకు రివార్డులు ప్రకటించారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, వాంకిడి సీఐ శ్రీనివాస్, రెబ్బెన సీఐ అల్లం నరేందర్, సిర్పూర్– టి ఎస్సై దీకొండ రమేశ్, రెబ్బెన ఎస్సై భూమేశ్, దహెగాం ఎస్సై సనత్, కెరమెరి ఎస్సై వెంకటేశ్, తిర్యాణి ఎస్సై రమేశ్, కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియాకు రివార్డులు అందజేశారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం

- అల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు చేసిన వైద్యారోగ్యశాఖ
- నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



ఆసిఫాబాద్‌అర్బన్/కౌటాల: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లాలో ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. 1,71,760 మంది పిల్లలకు మాత్రలు వేయాలని నిర్దేశించుకోగా, 2,09,200 మాత్రలు అందుబాటులో ఉంచారు. నేడు మాత్రలు వేసుకోని వారికి తిరిగి 27వ తేదీన మాత్రలు వేసేలా ప్రణాళికలు రూపొందించారు.

విద్యాసంస్థలకు వైద్యసిబ్బంది

జిల్లా, మండల టాస్క్‌ఫోర్స్ టీంల పర్యవేక్షణలో అల్బెండజోల్ మాత్రలు వేసే విధానంపై వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. విద్య, శిశుసంక్షేమ, పంచాయతీరాజ్, మున్సిపల్, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు తదితర సంస్థల సహకారం తీసుకోనున్నారు. నులిపురుగుల నిర్మూలన మాత్రలు లక్ష్యం మేరకు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో 22 పీహెచ్‌సీల పరిధిలో మాత్రలు పంపిణీ చేస్తామని వైద్యారోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. అలాగే 1,253 పాఠశాలల్లోని విద్యార్థులకు మాత్రలు వేసేందుకు వైద్యసిబ్బంది, ఆశకార్యకర్తలు నేరుగా స్కూళ్లకు వెళ్లనున్నారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు వారికి 200 ఎంజీ మాత్రను నీటిలో కలిపి తాగించాల్సి ఉంటుంది. 3 నుంచి 19 ఏళ్లలోపు వారికి నేరుగా నోటి ద్వారా 400 ఎంజీ మాత్ర అందిస్తారు. అయితే మాత్రలు వేసుకున్న తర్వాత కొందరు వాంతులు చేసుకునే అవకాశం ఉంటుంది. అనారోగ్యంతో ఉండే పిల్లలకు మాత్రలు వేయొద్దని వైద్యులు సూచిస్తున్నారు.

అపరిశుభ్రతే కారణం..

పిల్లల్లో నులిపురుగుల సంక్రమించడానికి ప్రధాన కారణం అపరిశుభ్రత. శుభ్రం చేయడం పండ్లు, ఈగలు వాలిన ఆహారం తీసుకోవడం, చేతుల ద్వారా ఈ జీవులు శరీరంలోకి చేరతాయి. రక్తహీనత, పోషకాహార లోపం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, విరేచనాలు వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇది పిల్లల శారీరక, మానసిక పెరుగుదలపై ప్రభావం చూపుతాయి. చదువుపై ఏకాగ్రత ఉండదు. పిల్లలు పరిశుభ్రత పాటించేలా ప్రోత్సహించాలి. ఏదైనా తినే ముందు తప్పనిసరిగా చేతులు కడుక్కోవడం అలవాటు చేయాలి.

మాత్రలు వేయించాలి



జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తాం. 19 ఏళ్లలోపు వారికి మాత్రలు వేయించాలి. మాత్రలు వేయడానికి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిరాకరిస్తే లిఖితపూర్వకంగా వివరణ తీసుకోవాలి.

– డాక్టర్ కృష్ణప్రసాద్, జిల్లా ప్రోగ్రాం అధికారి

జీపీ కార్మికులకు అండగా ఉంటాం

- రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ, ప్రజాసంఘాల తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె బుధవారం 14 రోజుకు చేరింది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి భవిష్యత్తు కార్యాచరణపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో పోరాటంలో పాల్గొంటామని హెచ్చరించారు. అతి తక్కువ వేతనంతో పనిచేసే కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు కేశవ్‌రావు, కేవీపీఎస్ నాయకులు దినకర్, బీఎస్పీ నాయకులు భూక్య రాజు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, వివిధ సంఘాల నాయకులు తిరుపతి, మారుతి, రాజజేందర్, మాలశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరావాలి

కాగజ్‌నగర్‌టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 1న హైదరాబాద్‌లోని పరేడ్ మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు తరలిరావాలని ఏబీవీపీ కరీంనగర్ జిల్లా లా స్టూడెంట్స్ ఫోరమ్ కన్వీనర్ నక్క ప్రమోద్‌కుమార్ పిలుపునిచ్చారు. విస్తరక్ యోజనలో భాగంగా బుధవారం కాగజ్‌నగర్‌లో పర్యటించారు. పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేజీ టు పీజీ ఉచిత విద్య అందించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ పాలనలో విద్యావ్యవస్థను పూర్తిగా గాలికొదిలేశారని ఎద్దేవా చేశారు. పాఠశాల నుంచి మొదలుకొని యూనివర్సిటీ స్థాయి వరకు విద్యార్థులను కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా అన్యాయానికి గురిచేసిందని ఆయన విమర్శించారు.

'పైసలు తీసుకుని పట్టా చేస్తలేరు'



వివరాలు వెల్లడిస్తున్న రమేశ్

బెజ్జూర్(సిర్పూర్): తహసీల్దార్ డబ్బులు తీసుకుని భూమిని పట్టా చేయడం లేదని చింతలమానెపల్లి మండలం రణవెల్లి గ్రామానికి చెందిన జాటోత్ రమేశ్ అనే రైతు ఆరోపించాడు. బెజ్జూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం వివరాలు వెల్లడించాడు. బాధిత రైతు కథనం ప్రకారం.. బెజ్జూర్ మండలం సులుగుపల్లికి చెందిన కర్పత భిక్షయ్య, ఆయన తమ్ముడి వద్ద ఊట్‌సారంగపల్లి(సలుగుపల్లి) శివారులోని సర్వే నం.47/2లో జాటోత్ రమేశ్ రెండెకరాల ఆరుగుంటల భూమి కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నాడు. రిజిస్ట్రేషన్ ఆలస్యం కావడంతో ఓ వీఆర్ఏను సంప్రదించాడు. అనంతరం వీరు బెజ్జూర్ తహసీల్దార్‌ను కలిశారు. తహసీల్దార్ తన ఇంటికి రావాలని సూచించడంతో బాధితుడు వీఆర్ఏతో కలిసి కాగజ్‌నగర్‌కు వెళ్లాడు. మరో ఇద్దరి సమక్షంలో తహసీల్దార్ నివాసంలో రూ.50వేలు ఇచ్చినట్లు రైతు జాటోత్ రమేశ్ ఆరోపించాడు. సంబంధిత వీఆర్ఏను 'సాక్షి' సంప్రదించగా.. డబ్బులు ఇచ్చింది వాస్తవమేనని అంగీకరించాడు. ఈ విషయంపై బెజ్జూర్ తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డిని వివరణ కోరగా.. తనకు ఎవరూ డబ్బులు ఇవ్వలేదని, అతడి ఫైల్ మూడు నెలల క్రితమే ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు. కాగా.. 'తహసీల్దార్ పనిచేయకుంటే డబ్బులు తీసుకోవాలె గాని.. ఇలా చేయడం సరికాదు' అని కార్యాలయ సిబ్బంది బాధితుడిని బెదిరించినట్లు సమాచారం. భూమి కొనుగోలు చేసిన ప్రాంతం ఏజెన్సీ కావడంతోనే తహసీల్దార్ జాటోత్ రమేశ్‌ను డబ్బులు డిమాండ్ చేసినట్లు సమాచారం.

చెక్కు అందజేత

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వర్తిస్తూ గత ఫిబ్రవరిలో గుండెపోటుతో మృతి చెందిన ఏఆర్ ఎస్సై ఎం.సురేందర్ రెడ్డి భార్య ఇందిరకు బుధవారం రూ.59,800 విలువైన రెండు చెక్కులను ఎస్పీ సురేశ్‌కుమార్ అందించారు. పోలీసు శాఖ నుంచి బెనిఫిట్స్ రూ.49,800, విడో ఫండ్ నుంచి రూ.10 వేలు చెల్లించారు. ఎస్పీ మాట్లాడుతూ మృతి చెందిన ఎస్సై కుటుంబానికి రావాల్సిన అన్నిరకాల బెనిఫిట్స్ త్వరలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, కరుణాకర్, డీపీవో ఏవో శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పోలీసు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.విజయ్ శంకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ స్వామి పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

క్లుప్తంగా

హత్య కేసులో ఒకరికి పదేళ్ల జైలు

దండేపల్లి(మంచిర్యాల): హత్య కేసులో ఒకరికి పదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తు కోర్టు తీర్పునిచ్చినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. దండేపల్లి మండలం కనెనపల్లి శివారులోని ఓ పౌల్ట్రీ ఫాం వద్ద 2017 సెప్టెంబర్ 20న తిరుపతి అనే వ్యాన్ క్లీనర్‌ను, పౌల్ట్రీఫాంలో పనిచేసే అశోక్ హత్యచేశాడు. నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ పూర్తి కావడంతో నిందితుడు అశోక్‌కు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ మంచిర్యాల సెషన్ కోర్టు జడ్జి ప్రభాకరరావు బుధవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరికి ఏడాది జైలు

నస్పూర్(మంచిర్యాల): దాడి కేసులో ఒకరికి ఏడాది జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ మంచిర్యాల ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషద్వాని తీర్పునిచ్చినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. మంచిర్యాలలోని చున్నంబట్టి వాడకు చెందిన బాలకృష్ణ 24 డిసెంబర్ 2015న తనను అకారణంగా తిట్టి గాయపర్చాడని పట్టణ పరిధిలోని ఫ్లడ్ కాలనీకి చెందిన మండ రవి సీసీసీ నస్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సహిన్ సుల్తానా సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైతీర్పుని వెలువరించారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలుశిక్ష

మందమర్రిరూరల్(చెన్నూర్): నిర్లక్ష్యంగా లారి నడిపి ఒకరి మృతికి కారణమైన మహమ్మద్ యాసిన్‌కు శిక్ష ఖరారు చేస్తూ జిల్లా ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషద్వని తీర్పునిచ్చినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. 29 అక్టోబర్ 2017న శ్రీనివాస్, మరో ఇద్దరు మోటార్ సైకిల్‌పై పాత బస్టాండ్ వైపు వెళ్తుండగా మహమ్మద్ యాసిన్ అతివేగంగా లారీ నడుపుతూ ఢీకొట్టడంతో శ్రీనివాస్ మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీనివాస్ కుమారుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద మందమర్రి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సహిన్‌సుల్తానా సాక్షులను ప్రవేశపెట్టగా ఐపీసీ సెక్షన్ 304 (ఏ)కింద 18 నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా, ఐపీసీ సెక్షన్ 337 కింద ఐదు నెలల సాధారణ శిక్షతో పాటు రూ.500ల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

రామకృష్ణాపూర్(చెన్నూర్): మందమర్రి పట్టణానికి చెందిన గోమాస జయంత్‌కుమార్, స్థానిక నాగార్జునకాలనీకి చెందిన పెరుగు రాజశేఖర్ ఐదు రోజుల క్రితం సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎస్సై అశోక్ బాధితులకు ఫోన్లను అప్పగించారు.

రూ.100కే రెండు కేజీల చేపలు



అమ్మకానికి పెట్టిన అలుగు చేపలు

నెన్నెల(బెల్లంపల్లి): మండల కేంద్రంలోని బ్యాంకు సమీపంలో బుధవారం రూ.100 కే రెండు కిలోల చేపలు విక్రయించడంతో కొనుగోలు చేసేందుకు మత్స్యప్రియులు ఎగబడ్డారు. కన్నెపల్లి మండలం సాలిగామ ప్రాజెక్టు నుంచి బొలెరో వాహనంలో మత్స్యకారులు తీసుకువచ్చిన ఐదు క్వింటాళ్ల చేపలు గంట వ్యవధిలోనే అమ్ముడుపోయాయి. రూ.200లకు కేజీ ధర పలికే చేపలు రూ.100కే రెండు కిలోలు రావడంతో పోటీపడి కొనుగోలు చేశారు.

141 రోజులు.. 101 ఫోన్లు రికవరీ

పట్టణంలోని రాంనగర్‌కు చెందిన కోవ శ్రావణ్ గత నెల 30న తమ ఇంటికి వెళ్లే మార్గంలో ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు పదిహేను రోజుల వ్యవధిలోనే ఫోన్ ఆచూకీ కనుగొన్నారు. ఈ నెల 13న స్థానిక సీఐ రాజు చేతుల మీదుగా బాధితునికి ఫోన్ అప్పగించారు.

- సీఈఐఆర్ పోర్టల్‌పై పెరిగిన అవగాహన
- పోలీసుల విస్తృత ప్రచారం
- సామాన్యులకు సైతం అందుబాటులోకి...



బాధితునికి ఫోన్ అప్పగిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: జిల్లాలో రోజురోజుకూ సెల్‌ఫోన్ల చోరీలు పెరిగిపోతున్నాయి. ఫోన్ పోగొట్టుకున్న బాధితులంతా పోయిన ఫోన్ కంటే అందులో ఉండే డాటా కోసం ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఈ రోజుల్లో విద్య, వ్యాపారం, ఉద్యోగం, ఆరోగ్యం, బ్యాంకింగ్, రాజకీయ సమావేశాలు.. ఇలా ఎన్నో రకాల సమాచారాన్ని ఫోన్ల ద్వారానే నిర్వహిస్తున్నారు. కరోనా తరువాత సెల్‌ఫోన్ వినియోగం బాగా పెరిగింది. కూరగాయలు మొదలుకుని రూపాయి చాక్లెట్ వరకు కొనుగోలు చేయాలంటే సెల్‌ఫోన్ ద్వారానే చెల్లింపులు జరుగుతున్నాయి. విద్యార్థుల నుంచి మొదలుకుని వృద్ధుల వరకు స్మార్ట్‌ఫోన్ వినియోగించే వారి సంఖ్య పెరుగుతోంది. అంతేకాకుండా పలువురు తమ వ్యక్తిగత సమాచారం పలు సాఫ్ట్ కాపీల రూపంలో ఫోన్‌లోనే భద్రపర్చుకుంటున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే మానవునికి నిత్యజీవితంలో ఫోన్ కీలకంగా మారింది.

ఇంతటి కీలకమైన ఫోన్ పోగొట్టుకున్నా..లేక చోరీకి గురైతే పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారా? ఫోన్ పోయిన వారు ఇకనుంచీ భయపడాల్సిన అవసరం లేదు. పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఎక్వీప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ (సీఈఐఆర్)ను అందుబాటులోకి తీసుకువచ్చింది. పోయిన ఫోన్లు గుర్తించడంలో సీఈఐఆర్ పోర్టల్ కీలక పాత్ర పోషిస్తోంది. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఈ ఏడాది మార్చి 1న ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 689 దరఖాస్తులను పోర్టల్‌లో నిక్షిప్తం చేశారు. ఇందులో 101 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. సీఈఐఆర్ వెబ్ పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత పోలీసులు సత్ఫలితాలు సాధిస్తున్నారు.


పోర్టల్‌పై అవగాహన కల్పిస్తున్నాం

సీఈఐఆర్ వెబ్‌పోర్టల్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సోషల్ మీడియా, గోడ ప్రతుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 689 దరఖాస్తులు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయగా 101 సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు అందజేశాం. ఫోన్ పోయిన వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. వీలైనంత త్వరగా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేస్తే సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది. కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులకు సీఈఐఆర్ పోర్టల్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చాం.

– రెమా రాజేశ్వరి, రామగుండం పోలీస్ కమిషనర్

డిస్పెన్సరీలో మరమ్మతులు చేపట్టాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి డిస్పెన్సరీ లోపల మరమ్మతులు చేపట్టాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం క్యాజువాలిటీ గదిలో పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. ఆ సమయంలో ఆసుపత్రి సిబ్బంది, రోగులు లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న శ్రీనివాస్‌రావు ఊడిపోయిన పైకప్పు పెచ్చులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్డింగ్ లోపల కాకుండా బయట మాత్రమే పనులు చేపట్టి లోపలి భాగాన్ని విస్మరించారన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయన్నారు. నీటి ట్యాంకులను శుభ్రం చేయటం, స్లాబుపై చెత్తా చెదారం తొలగించడం, సైడ్ గోడలకు చెమ్మ రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని, మహిళలకు ప్రత్యేక టాయ్‌లెట్స్ ఏర్పాటు చేసి పురుషుల మరుగుదొడ్లను ఆధునీకరించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.



ఆస్పత్రిని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రావు

దసరాకు ముందు లాభాల వాటా పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు

శ్రీరాంపూర్: రాబోయే దసరాకు ముందు సింగరేణి కార్మికులకు లాభాలవాటా పంపిణీ చేయడం జరుగుతుందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు తెలిపారు. బుధవారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ సాధించిన లాభాల నుంచి రూ.700 కోట్ల వాటాను కార్మికులకు పంచుతామని ముఖ్యమంత్రి కేసీఆర్ నస్పూర్‌లో జరిగిన బహిరంగసభలో హామీ ఇచ్చారన్నారు. కోలిండియాలో లేని హక్కులను సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు కల్పించారన్నారు. కారుణ్య ఉద్యోగాల ద్వారా సుమారు 15వేల మందికి, ఎక్స్‌ట్రనల్ ద్వారా మరో 5 వేల మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. కార్మికులు రూ.10 లక్షలు ఇంటి రుణం తీసుకుంటే వడ్డీని రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారన్నారు. బేసిక్‌పై ఒకశాతం కరెంట్ బిల్లులు కార్మికులు చెల్లించేవారని, దీన్ని నేడు కేసీఆర్ పూర్తిగా రద్దు చేయించారన్నారు. రిటైర్మెంట్ వయస్సును కూడా ఏడాది పెంచారన్నారు. కార్మికుల తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. 2022 నాటికి ఉద్యోగంలో చేరి 190/ 240 మస్టర్లు పూర్తి చేసిన బదిలీ వర్కర్‌ను నెల రోజుల్లో జనరల్ మాదిరిగా పర్మినెంట్ చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి చాట్ల అశోక్, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, జీఎం కమిటీ సభ్యులు వెంగల కుమారస్వామి, నాయకులు అశోక్, తొంగల రమేశ్, ల్యాగల శ్రీనివాస్, సత్యనారాయణ, అన్వేష్‌రెడ్డి, పిట్ సెక్రెటరీ మెండ వెంకన్న, జంపయ్య, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘చింతలమాదర’కు జలకళ



ఇటీవల కురిసిన వర్షాలకు చింతలమాదర జలపాతంకు జలకళ సంతరించుకుంది. బుధవారం నుంచి సందర్శకులకు అనుమతి ఇస్తున్నట్లు ఏకో టూరిజం కమిటీ చైర్మన్ గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఈ జలపాతం వీక్షణకు ఏటా ఉమ్మడి జిల్లాతో పాటు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి సందర్శకులు వస్తుంటారు.

– తిర్యాణి(ఆసిఫాబాద్)

కేయూ పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు వాయిదా

కేయూ క్యాంపస్ : తెలంగాణలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 20 (నేటి నుంచి) నుంచి ప్రారంభం కానున్న వివిధ విభాగాల్లోని పీహెచ్‌డీ రెండో కేటగిరీ ప్రవేశాల ఇంటర్వ్యూలను నిరవధికంగా వాయిదా వేసినట్లు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ మేరకు బుధవారం క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలో వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన డీన్లు, విభాగాధిపతులు, పాఠ్యప్రణాళిక అధ్యక్షులు, ఇతర అధికారులతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని, మరిన్ని వివరాలకోసం విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో చూడాలని శ్రీనివాసరావు వెల్లడించారు.

మా కడుపులు కొట్టకండి..



ప్రైవేట్ కార్మికులకు దండం పెడుతున్న పంచాయతీ కార్మికులు

భీమిని(బెల్లంపల్లి): తమ డిమాండ్లు నెరవేర్చాలని 13 రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తున్నారు. బుధవారం భీమిని, కన్నెపల్లి మండలాల్లోని పలు గ్రామ పంచాయతీల్లో ప్రైవేట్ కార్మికులతో పనులు చేయించారు. దీంతో మా కడుపులు కొట్టవద్దంటూ దండం పెడుతూ కన్నెపల్లి మండలంలోని పారిశుద్ధ్య కార్మికులు వేడుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇద్దరిపై కేసు నమోదు

పెంచికల్‌పేట్: మండలంలోని దరోగపల్లి గ్రామానికి చెందిన టేకం గణపతి, రెడ్డి ఇస్తారిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ప్రభాకర్ తెలిపారు. దరోగపల్లి చెరువులో సభ్యత్వం లేని వారు చేపలు పడుతున్నారని చేద్వాయి మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు బోయిరే సోమన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి పట్టిన చేపలు, వలలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సాంకేతిక అంశాలపై పట్టు ఉండాలి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయులు సాంకేతిక అంశాలపై పట్టు కలిగి ఉండాలని డీఈవో యాదయ్య అన్నారు. బుధవారం మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాలలో గురుశాల(ప్రథమ్ ఫౌండేషన్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సాంకేతిక అంశాలపై మెలకువలు, బోధనాభ్యసన ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బోధనాభ్యసన ప్రక్రియలో డిజిటల్ ఉపకరణాల వినియోగానికి సమర్థవంతంగా చేసేందుకు శిక్షణ తోడ్పడుతుందని తెలిపారు. ఉపాధ్యాయులకు సాంకేతికతను చేరవేసే బాధ్యతను భుజానికి ఎత్తుకున్న గురుశాల టీంను అభినందించారు. కోఆర్డినేటర్లు కె.చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, సహాయ గణాంక కో–ఆర్డినేటర్ రాజుకుమార్, గురుశాల సభ్యులు దుర్గేష్, తివారి, నీతూ, సృష్టి, మేఘన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్షరాలు నేర్వాలంటే..అడుసు తొక్కాల్సిందే!



మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణ బురద మయంగా మారింది. విద్యార్థులు బడిలోకి రావాలంటే అడుసు(బురద) తొక్కాల్సిందే. పాఠశాల సమీపంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టరు పాత భవనం కూల్చడంతో దానికి సంబంధించిన ఇటుక పెళ్లలు పాఠశాల ఆవరణలో పోయడంతో వాటిని దాటేందుకు విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థుల బురద కష్టాలు తీర్చేందుకు కనీసం మొరం పోయించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

– దండేపల్లి(మంచిర్యాల)

అద్దెభవనంలోనే ఈఎస్ఐ ఆస్పత్రి

- కార్మికులకు అందని వైద్యసేవలు
- పూర్తిస్థాయి వైద్యసేవలకు దూరప్రాంతాలకు వెళ్తున్న వైనం
- పక్కాభవనం నిర్మించాలని డిమాండ్



అద్దె భవనంలో కొనసాగుతున్న ఈఎస్ఐ ఆస్పత్రి

పాతమంచిర్యాల: జిల్లాలోని వివిధ కర్మాగారాలు, ప్రైవేటు కంపెనీలలో పనిచేసే కార్మికులకు ప్రభుత్వం ఈఎస్ఐ ఆస్పత్రి ద్వారా వైద్యసేవలు అందిస్తోంది. ఇందుకు వారి వేతనాలలో కొంతమొత్తాన్ని ప్రభుత్వం జమ చేసుకుంటుంది. కార్మికుల వైద్య అవసరాలకు ఆ మొత్తాన్ని వినియోగిస్తుంది. బొగ్గు ఆధారిత పరిశ్రమలలో పని చేసేవారు, జైపూర్ పవర్‌ప్లాంట్, దేవాపూర్ సిమెంట్ కర్మాగారం, మట్టిపై పుల తయారీ పరిశ్రమలు, బ్రెడ్ కంపెనీ, హోటళ్లు, ఆటోమోబైల్, ఇతర పరిశ్రమలలో పని చేసే వారు ఈఎస్ఐ కార్డులు పొందుతారు. ఈఎస్ఐ కార్డులు కలిగి ఉన్న కార్మికులు జిల్లాలో ఎనిమిది వేలమంది ఉన్నారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు వైద్యంకోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ఈఎస్ఐ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందే అవకాశం ఉంది. ప్రతిరోజు వైద్యంకోసం 60 నుంచి 80 మంది వరకు ఆస్పత్రికి వస్తున్నారు. కానీ జిల్లా కేంద్రంలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో కార్మికులకు వైద్యసేవలు అరకొరగానే అందుతున్నాయి. అద్దె భవనంలో కొనసాగుతున్న ఆస్పత్రిలో సరైన వసతులు లేక నామమాత్రంగా వైద్య సేవలు అందుతున్నాయని కార్మికులు వాపోతున్నారు. కేవలం ఓపీ సేవలు మాత్రమే అందుతున్నాయని, బెడ్స్ లేకపోవడంతో ఎమర్జెన్సీ కేసులను జిల్లా కేంద్రంలోని, కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాల బారిన పడినవారు, గుండె, మూత్రపిండాల సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రికి వస్తే ఇక్కడి వైద్యులు హైదరాబాద్‌లోని నాచారం ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారని కార్మికులు పేర్కొంటున్నారు. కాగా మందులు నిలువ చేసేందుకు సరిపడా గదులు లేకపోవడంతో వరండాలోనే నిలువ చేస్తున్నారు. అంతేకాకుండా రోగులు వేచి ఉండడానికి గదిలేకపోవడంతో వరండాలోనే కూర్చుంటున్నారు. కనీస వసతులు లేక రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆస్పత్రికి పక్కా భవనం నిర్మించి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదికలు పంపించాం

జిల్లా కేంద్రంలోని ఈఎస్ఐ ఆస్పత్రికి పక్కా భవనంలేక పదేళ్లుగా అద్దెభవనంలోనే కొనసాగుతోంది. భవన నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. పక్కా భవనం నిర్మిస్తేనే ఆస్పత్రిలో వసతులు మెరుగుపడతాయి.

– ఏ.రవీంద్రబాబు, వైద్యాధికారి, ఈఎస్ఐ ఆస్పత్రి, మంచిర్యాల

గురుకులాల కార్యదర్శిని కలిసిన ‘రేగుంట’

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ రాష్ట్ర గురుకులాల నూతన కార్యదర్శిగా డాక్టర్ నవీన్ నికోలస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట లింగయ్య ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌కు అవసరమైన చర్యలు చేపట్టాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని, నాణ్యమైన విద్యను అందించడం, పక్కా భవనాల ఏర్పాటు విషయంలో దృష్టి సారించాలని ఆయన కోరారు.



గురుకులాల కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న లింగయ్య

‘ప్రైవేటు విద్యాసంస్థల సమస్యలు పరిష్కరించాలి’

నస్పూర్: ప్రైవేటు విద్యారంగ సంస్థల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కేజీ టు పీజీ విద్యాసంస్థల జేఏసీ జిల్లా కన్వీనర్ రాపోలు విష్ణువర్ధన్‌రావు తెలిపారు. జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కో కన్వీనర్ చంద్రమోహన్‌గౌడ్‌తో కలిసి మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్ని పార్టీలు తమ మేనిఫెస్టోల్లో చేర్చాలని, రాబోవు రోజుల్లో అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లను కలుస్తామని తెలిపారు. విద్యాసంస్థలు స్థాపించి పదిహేను ఏళ్లు పూర్తి చేసుకున్న వాటికి శాశ్వత గుర్తింపు ఇవ్వాలని, బస్సులకు టోల్‌టాక్స్ మినహాయింపు ఇవ్వాలని, సిబ్బందికి హెల్త్‌కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రైవేటు పాఠశాలల మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు ఉస్మాన్ పాషా, నస్పూర్ పట్టణ అధ్యక్షులు సబిహాసుల్తానా, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ గోపతి సత్తయ్య, నాయకులు మోహన్‌వర్మ, విక్రమ్‌రావు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రావు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



మృతి చెందిన రాజ్‌కుమార్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోహన్

బెల్లంపల్లి: పట్టణంలోని కన్నాలబస్తీ కల్వర్టు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. వన్‌టౌన్ ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన జాడి రాజ్‌కుమార్(35), రెబ్బెన మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన బట్టి మోహన్ బెల్లంపల్లి బజారు ఏరియా నుండి తాండూర్ వైపు బైక్‌పై వెళ్తుండగా తాండూర్ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఘటనలో రాజ్‌కుమార్ మృతి చెందగా మోహన్‌కు గాయాలు కావడంతో మంచిర్యాలకు తరలించారు. సంఘటనాస్థలిని బెల్లంపల్లి రూరల్ సీఐ ఎస్.రాజ్‌కుమార్‌గౌడ్, వన్‌టౌన్ ఏఎస్సై ఆర్.తిరుపతి సందర్శించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి’

పాతమంచిర్యాల: పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. బీసీలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగానే వివిధ పార్టీలు భావిస్తున్నాయన్నారు. సమావేశంలో సంఘం నాయకులు గజెల్లి వెంకటయ్య, రాజేశంగౌడ్, బోడంకి మహేష్, కొత్తకొండ రమేశ్, గగ్గూరీ రాజన్న, జంబోజీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుమ్ముల శ్రీనివాస్